క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటిపాలెంలో ఈవీఎంల వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఇ.భాస్కరరావు మెషీన్ పనితీరును సిబ్బందికి వివరించారు. అలాగే పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు సర్వేయర్ గణపతిరావు, తదితరులున్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



పైడిరాజుకు నియామకపత్రం అందిస్తున్న తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బట్టాన రాము నెల రోజుల కిందట విధి నిర్వహణలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కారుణ్య నియామకంలో భాగంగా ఆయన చిన్న కుమారుడు బట్టాన గోవిందకు ఉద్యోగం లభించింది. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధర్మరాజు గోవిందకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీటీ శైలజ, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, వీఆర్వో పైడిరాజు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి సహకరించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం దాలినాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి సహకరించాలని బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు అన్నారు. బుధవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం ప్రమోద్‌కుమార్‌దాస్‌తో కలిసి ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివాజీ, ఆలుగు వెంకటరావు, సహాయ కార్యదర్శి తామాడ కృష్ణకుమారి, లక్ష్మణరావు, అక్కమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



కొండతామరపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

గంట్యాడ: ధాన్యం విక్రయించుకునే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొండతామరపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. తూనిక యంత్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం విక్రయించుకునేందుకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ట్రక్ షీట్‌లు ఒకటి, రెండు మిల్లులకే ఇవ్వడం వల్ల అన్‌లోడింగ్‌లో ఇబ్బంది ఎదురవుతోందని, అన్ని మిల్లులకూ ఇస్తే అన్‌లోడింగ్ సమస్య ఉండదని రైతులు సూచించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని ఆయన చెప్పారు. ఆయన వెంట ఏఓ శ్యామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్

గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణపై స్థానిక శ్రీకృష్ణావిద్యాపీఠ్‌లో విద్యార్థులకు అగ్నిమాపకశాఖ అధికారి(ఎస్ఎఫ్ఓ) ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీలు వల్ల వచ్చే మంటలను వాటిని అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈసందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి మాట్లాడుతూ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, థియేటర్లలో అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు భయాందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని చెప్పారు. ఇళ్ల వంట చేసేటప్పుడు వంట గది కిటికీలు తెరిచి ఉంచాలని, వంటపూర్తయ్యాక గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు పెద్ద పీట

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- పూల్‌బాగ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



విజయనగరం: వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఒకటో డివిజన్ పూల్‌భాగ్ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిబిరానికి స్థానికులు హాజరైమ వైద్యసేవలు పొందారు. ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను కోలగట్ల నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడత కార్యక్రమం విజయవంతం కావడంతో.. రెండో విడత కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమైందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య శిబిరాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రోగులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పరిధిని 25 లక్షల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, ప్రతి డివిజన్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు రెండో విడత ప్రారంభమయ్యాయన్నారు. గతంలో ఒకటో డివిజన్‌లో 600 మంది వరకు వైద్య సేవలను ఉచితంగా పొందారన్నారు. ఇంకా మిగిలి ఉన్న వారికి కూడా మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, శస్త్రచికిత్సలు చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

వినియోగించుకోవాలి

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలని జిల్లా ప్రత్యేక పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా పూల్ బాగ్ లో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రం, బ్లడ్‌బ్యాంక్, ఐసీటీసీ సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు, డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: ప్రజలకు అందించే మందులు పరిశీలిస్తున్న కోలగట్ల, తదితరులు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట సచివాలయం 1 పరిధిలో జగనన్న ఆరోగ్యసురక్ష ఫేజ్–2లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు డి.రామునాయుడు, ఎల్.వినోద్‌కుమార్, జి.మౌనిక , టి.నారాయణరావు సుమారు 150 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్. రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ బోర్డుల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక థామస్‌పేట పుట్‌బాల్ గ్రౌండ్ లో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం లో భాగంగా సచివాలయాల వారీగా క్రికెట్ పోటీలు నిర్వహించారు.

అర్హతే ప్రామాణికం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అమలు చేసే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 34 డివిజన్ ప్రదీప్ నగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శశిభార్గవి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, కృష్ణంరాజు, పాపారావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- ఎస్ఈబీ సీఐ మధుకర్

విజయనగరం అర్బన్: యువత మత్తు పానీయాలు, పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ అన్నారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్త నిర్వహణలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 'డ్రగ్ ఫ్రీ ఇండియా చాలెంజెస్' అనే అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్తు పానీయాలు మనిషి కేంద్ర నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయన్నారు. ఎస్ఈబీ అధికారి శైలజారామ్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దన్‌నాయుడు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుభ, కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ జయపాలరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రగ్ రహిత సమాజాన్ని కోరుతూ ప్రతిజ్ఞ చేస్తున్న ముఖ్య అతిథులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్..



పూసపాటిరేగ: కొల్లాయివలసలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, అప్పలనాయుడు, తదితరులు

- ఎంపీపీ మహంతి కల్యాణి

పూసపాటిరేగ: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల్ భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని చౌడువాడ, కొల్లాయివలస, వెల్దూరు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఆమె బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చదువుతోట పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడల కోసం కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, మండల వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, మొంగం నాగబాబు, తాడిశెట్టి బాబు, కొయ్యి రామస్వామి, దారపు అప్పలసూర్రెడ్డి, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు

విజయనగరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా 14వ డివిజన్ 17వ నంబర్ సచివాలయ పరిధిలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని యువతీ, యువకులు ఆరోగ్యవంతంగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆడదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి ఐదు అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడలపై ఆసక్తి..

డెంకాడ: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బద్దుకొండ ప్రదీప్ అన్నారు. మండలంలోని పెదతాడివాడలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల యుజన విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు, పెదతాడివాడ ఎంపీటీసీ సభ్యుడు గాదిపల్లి రమేష్, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఈఓపీఆర్‌డీ జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు గాదిపల్లి పెదరామ్మూర్తి, వెంపడాపు రమణ, సచివాలయ అధికారులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజ నాయకుడు బద్దుకొండ ప్రదీప్, తదితరులు

థామస్‌పేటలో..

నెల్లిమర్ల: నగరంలోని థామస్‌పేట పుట్‌బాల్ గ్రౌండ్‌లో ''ఆడుదాం ఆంధ్ర'' కార్యక్రమం లో భాగంగా సచివాలయాల వారీగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, వార్డు సెక్రెటరీలు, వార్డు వాలంటీర్లు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమిషనర్ బాలాజీప్రసాద్



విజయనగరం: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పింఛన్ల పంపిణీ

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్ పెంపు పథకాన్ని ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి దశల వారీగా పెంచుతూ రూ. 3 వేలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 'జగనన్న అండగా... పింఛనుదారుల పండగ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. సమావేశంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన పింఛన్ పెంపు పథకాన్ని శతశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ. 3 వేల పింఛన్ అందిస్తున్న తొలి రాష్ట్రం మనదే కావడం గర్వకారణమని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దీవెనలు అందించే విధంగా రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించాలన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్లను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి రూ. 3 వేల పింఛన్ అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రారంభమైన విజయనగరం బాలోత్సవం

విజయనగరం టౌన్/ పూల్‌బాగ్: రెండు రోజుల పాటు జరగనున్న విజయనగర బాలోత్సవాలు బుధవారాం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ పతాకాన్ని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వాసుదేవరావు , బాలోత్సవాల వ్యవస్థాపకుడు వాసిరెడ్డి రమేష్ బాబు మాట్లాడుతూ, బాల బాలికలకు కళల పట్ల ఉన్న ఆసక్తిని, సృజనాత్మకను వెలికితీయడానికి ఈ ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలోఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతినాయుడు, మండల విద్యాశాఖాధికారి పి.సత్యవతి, ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ చలం , కె. శ్రీనివాసరావు, కోరడ్ల రమాప్రభ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అరుణకుమారి



మాట్లాడుతున్న నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తదితరులు

నెల్లిమర్ల: పూసపాటిరేగ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన చిక్కాల అరుణకుమారి ఈనెల 6న ప్రమాణ స్వీకారం చేస్తారని ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తెలిపారు. నెల్లిమర్లలో తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. తన సతీమణి అరుణకుమారికి నియోజకవర్గ స్థాయి నామినేటెడ్ పదవి లభించడం ఆనందంగా ఉందని చెప్పారు. నియోజకవర్గ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎస్. రామారావు, కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నగర కమిటీ జనరల్ సెక్రటరీ ఇడదీసి శ్రీనివాసరావు, కార్యదర్శి మహంతి అప్పలనాయుడు, కె. అప్పారావు, ఎ. మధుసూదనరావు, కె. హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

- బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ

మెరకముడిదాం: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మెరకముడిదాం, బిల్లల వలస, గర్భాం ఉన్నత పాఠశాల లతో పాటు మెరకముడిదాం కస్తుర్బా గాంధీ విద్యాలయం, గర్భాం మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించడంతో పాటు వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యా యులకు సూచించారు. అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. వంట నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



గర్భాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న విద్యుత్ లైన్ల మ్మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సవరవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో రావాడ, కవులవాడ, తూడెం, ఎ. రావివలస, గూడెపువలస, దల్లిపేట, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

విజయనగరం పూల్‌బాగ్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ అన్నారు. పట్టణంలోని 46వ డివిజన్ పరిధిలో ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

భోగాపురం: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నక్క పైడిరాజును ఎస్సై కృష్ణమూర్తి బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నిందితుడు కొంత కాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాటు వేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

30 మద్యం సీసాలు..

విజయనగరం క్రైమ్: గుంకలాం గ్రామ శివారులో అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 30 సీసాలను స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ శాఖా గ్రంథాలయానికి ఆ గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రవ్వా రామకృష్ణ బుధవారం ఆరు కుర్చీలు అందజేశారు. గ్రంథాలయ అధికారి కె.సూర్యనారాయణ, స్థానికులు రాపాక అచ్చిం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి పల్లకీ సేవ



గోదాదేవి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మ వారి పల్లకీ సేవను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.